# పులి చెలువులో పిట్టల వేట

**కు**క్కల జమీందారు గారి అసలు పేరు చాలా తక్కువ మందికి తెలుసు. ఆయనకు బుద్ధిపుటినప్పుడల్లా కుక్కల మందని వెంటేసుకుని వీధుల వెంట షికారు బయలుదేరేవాడు. లిల్లీ.. బ్యూటీ.. యూ... దిస్ సైడ్ ఊ ఇటు డామిట్... నో!, నో! కమ్ దిస్ సైడ్... జాకీ... నిన్నే... డోన్ట్‌గో అని కుక్కల్తో ఇంగ్లీషూ, తెలుగూ మాట్లాడుతూ మందలిస్తూ వాటి మధ్య నడుస్తుంటే చూసే వాళ్ళకు గొప్ప తమాషాగా ఉండేది. అవి బ్రిటిష్ పరిపాలన ఆఖరిదశలో ఉన్న రోజులు.

జమీందారీలు పోయాయి. కుక్కల జమీందారుగారు కాలం చేశారు. మచ్చుకొక మూడు నాల్గు కుక్కల్ని వుంచి మిగతా మందని అతని కొడుకు పంచి పెట్టేశాడు. వాటి రోగాలకి, పురుళ్ళు పోయడానికి తండ్రిగారు అపాయింట్ చేసిన రిటైర్డు వెటర్నరీ డాక్టరుగారు హోమ్యోపతీ ప్రాక్టీసులో దిగిపోయారు.

## 2

జమీందారు రఘునాధరావుగారు కుక్కల విషయంలో ఫక్తు వ్యతిరేకి. శునక ప్రియుడి కొడుకు శునకద్వేషిగా మారాడు. అతనికి తుపాకీల మీద బాతుల వేట మీద ఉండే ఆసక్తి మరిదేనిమీదా ఉండేదికాదు. తుపాకీ భుజాన్నేసుకొని చెరువుల వెంట, డొంకల్లోనూ తిరిగేవాడు. వేటగాడికి కుక్కల మీద సాధారణంగా ద్వేషం ఉండదు. మరి అయితే ఒక చిన్న సంఘటన వల్ల అతనిలో ఈ అనుకోని మార్పొచ్చింది. అప్పటికి వాళ్ళ నాన్నగారు కాలం చేసి అట్టే రోజులు కాలేదు.

ఒకరోజున రోడ్డు మీద నడుస్తున్న జమీందారు రఘునాధరావుగారిని కటిక్కిన పిక్కట్టుకొని కాటేసింది ఒక భైరవస్వామి.

''అరే! అరచిన కుక్క కరవదంటారు!?'' నెత్తురు కారిపోతోంది.

అయితే, అరిచిన కుక్కలు కూడా కరుస్తాయన్న మాట! స్వీయానుభవం మీద గ్రహించారు ఆ సత్యం. కుక్కది మాత్రం తప్పు కాదు. ముందే మొరుగుతూ, అరుస్తూ వార్నింగిచ్చింది, రోడ్డు ప్రక్క ఎంగిలాకులు నాకుతున్న ఓ ఊరకుక్క, పక్కనుంచి పోతున్న జమీందారును చూచి. ''అమ్మో, అమ్మో! కొంప మునిగిపోయింది. జమీందారుగారిని కుక్క కరిచేసింది. కొంపతీసి పిచ్చి కుక్కేమో?'' దుడ్డుకర్రలు పట్టుకొని, జమీందారుగారి మందీ మార్బలం ఊర్లో పడ్డారు. ఆ పిచ్చి కుక్కని హతమార్చడానికి. ఎండకి ఒగర్చుకుంటూ నాలిక బయటకు చాచి రెస్టు తీసుకుంటున్న ప్రతీ కుక్కని పిచ్చి కుక్క అని కన్‌ఫర్మ్ చేసి బాదేశారు. బక్కచిక్కిన కుక్కల్నీ, జడ్డి మొహం కుక్కల్నీ, పిచ్చిదానిలా కనిపిస్తే చాలు; అదే బహుశా జమీందారుగార్ని కరిచుంటుందని కొట్టేశారు. మొత్తం ముప్పయి కుక్కల దాకా యమలోకానికి పంపించేశారు. అసలు కరిచింది మాత్రం దొరికిందో లేదో ఎవరికీ తెలీదు.

నెత్తురు కారుతూ కుంటుకుంటూ ఇంటికి వచ్చిన జమిందారు గారిని, పెంపుడు కుక్కలు ఆప్యాయంతో మొరుగుతూ వచ్చి వెనక్కి ముందుకి పరుగులెత్తుతూ అరుస్తూ చెలగాటలాడటం మొదలెట్టాయి. వాటికేం తెలుసు, అరచిన కుక్కలు కూడా కరుస్తాయనే సత్యాన్ని ఇప్పుడిప్పుడే

తమ యజమాని గ్రహించినట్టు.

''అమ్మో! ఇవి అరుస్తున్నాయి. వీటిని నమ్మకూడదు, కరుస్తాయి! అరచిన కుక్కలు కూడా కరుస్తాయి! వీటిని ఉంచకూడదు!'' అని మూలనున్న తుపాకీ తీసి ఫెళ ఫెళ కాల్చేశాడు. మొత్తం మీద ఆరోజు దారుణమైన భైరవ హత్యాకాండ జరిగింది.

జమీందారుగారు కూనరారు పరిగెత్తారు. కడుపుమీద పదమూడు సూదులు పొడిపించుకున్నారు. ''ఇక నీకు పిచ్చెక్కదు పో'' అన్నాక హమ్మయ్య అని బయటపడ్డారు.

## 3

తరువాత

చాలా రోజులకి ఓ సుముహూర్తాన అమ్మాయి పుట్టింది.

బారసాలనాడు అమ్మాయికి మేరీ అని నామకరణం చేయించాడు రఘునాధరావు.

''అపచారం, అపచారం! హిందువులమ్మాయికి మేరీ అని పేరు పెట్టడమా? '' అని నోరు నొక్కు కున్నారు బంధుకోటి.

''గవర్నరంతటి వాడే మెచ్చుకోగాలేంది వీళ్ళతో లెక్కేమిటి సరే.. నా యిష్టం!'' అన్నాడు గుడ్లెర్రజేస్తూ. భర్త సంగతి తెలిసిన సరోజిని ఈ విషయంలో నోరు మెదపలేదు, మూర్ఖపు పట్టుదల గల మనిషని బాగా తెలుసును.

''కుక్కకాటు మానినా ఎక్కడో పిసరంత వెర్రి మిగిలి పోయింది. పాపం అందుకే ఇటువంటి తిక్కపనులు చేస్తుంటాడు. ''

''కోన్‌కిస్కా గాళ్ళను చీరేస్తా'' నంటూ బారసాల మంటపంలో చిందులు తొక్కాడు. రెండు మూడు గాజు గ్లాసులు పగలగొట్టాడు. ఇవేమీ అర్థంకాక చూస్తున్న బంట్రోతు గుంటడ్ని గూబ జిగ్‌మనేలా అంటించాడు.

ఈ ఉగ్ర నరసింహావతారం ఆ మర్నాడు మధ్యాహ్నానికి గాని తగ్గలేదు. పాపం గుంటడ్ని కొట్టి నందుకు ఇదై పోయనాడు. పిలిపించి ''ఒరేయ్, నాకుకోపంగా ఉన్నప్పుడు దగ్గరుండకురా. ఏమనుకోకు; కొట్టానని. ఆ.. నవ్వరా గుంటడా.. ఓశ్, ఓశ్, నవ్వు!'' అని పాతిక రూపాయ లిచ్చాడు ఖద్దరు సూటు కుట్టించుకోమని.

## 4

భార్య సరోజం పోయింది. రఘునాధరావు ముసలాడై పోతున్నాడు. యవ్వనం చిగురిస్తున్న మేరీ కుందనపు బొమ్మలా తయారయింది. డబ్బు తరిగిపోతోంది. వయస్సు, భార్య, డబ్బు తరుక్కు పోయినా జమీందారుగారికి రాజసం, పట్టుదల, కోపం తగ్గలేదు. సరోజం పోయిన తర్వాత కోపం మరీ ఎక్కువైపోయింది. భార్య పోయిన తరువాత పిచ్చోడిలా ఊళ్లు తిరిగి యాత్రలు చేశాడు. భార్య అస్థికల్ని పుణ్య నదుల్లో కలుపుతూ ''జీవితం బీటలు వారింది, నాకు మరి బ్రతుకు దామనే ఆశలేదు. ఉన్నదంతా ఒక్కటే. మేరీని ఓ ఇంటిదాన్ని చేసెయ్యాలి'' అని అంటుండేవాడు. యాత్రలు చేస్తుండగా కాశీలో గుండె జబ్బు వచ్చింది. ''అట్టేకాలం పట్టదు బాల్చీ తన్నెయ్యడానికి'' కాబట్టి మేరీకి పెళ్ళి చేసెయ్యాలని పట్టుబట్టాడు. తనకు మిగిలిన ఒక్క

''ఈ బూజు పట్టిన కోటలో తనొక్కడూ దయ్యంలా ఎలా ఉండాలి-'' అని అనుకునే వాడు. మేరీ తన దగ్గర లేకపోతే జీవించలేడు. మరెలా? అల్లుడ్ని ఇల్లరికం తెచ్చుకుంటే?

తన కూతురుకి తగిన వరుడి కోసం మాంత్రికుడిలా దుర్భిణిలో చూశాడు. అమెరికాలో చదువు కుంటున్న మేనల్లుడు ఆనంద్ బాబు కనిపించాడు.''భలే డింభకా, భలే!'' అనుకున్నాడు. ఎర్రగా నాజుగ్గా అమ్మాయిలా ఉంటాడు. విట్టీబోయ్. తనకి ఆట పట్టించడం మహాసరదా. మేరీకి కూడా ఇష్టమే. చిన్నప్పుడు ఒకసారి వీళ్ళింటికి వచ్చినప్పుడు ఇద్దరూ కలిసి ఫౌంటేన్ గట్టుమీద ఎంతో చక్కగా ఆడుకునేవారు. ఒకసారి పోట్లాడి అల్లిక సూదిపెట్టి మేరీ ఆనంద్‌ని గుచ్చేసింది.

'చూశావా, తమ్ముడూ; నీకూతురు మావాడిని అల్లిక సూదితో ఎలా పొడిచేసిందో? చూస్తుండు; దీన్ని మా యింటి కోడల్ని చేసుకొని తిక్క కుదురుస్తాను!'' అని అక్కాయంటుంటే రఘునాథరావు మురిసిపోతూ ''అలానే కానీ, అక్కా'' అన్నాడు.

మేరీ పెళ్ళి ప్రయత్నాలు మొదలు పెట్టడానికి మంచిరోజు కోసం ఆలోచిస్తూ హవానా సిగార్ కాల్చుకుంటూ డాబా మీద సాయంకాలం గాలికి కూర్చున్నాడు జమీందారుగారు. క్రింది నుంచి మేరీ టార్గెట్సు మీద ప్రాక్టీసు చేస్తున్న. 22 బోర్ రైఫిల్ గుళ్ళ చప్పుడు వినిపిస్తోంది.

''నాన్నా, నాన్నా! మరేం, మరేం..'' అంటూ చిన్న సైజు రైఫిల్ చేత్తో పట్టుకొని ప్రాక్టీసు ఆపి క్రింది నుంచి మీదికి వచ్చిన మేరీ మొదలెట్టింది.

''ఏంటమ్మా, ఏంకావాలి?''

''నాన్నా, మరే; చిన్న కుక్క పిల్లని పెంచుకుందాం నాన్నా!''

''కుక్కా ?''అంటూ కాళ్ళలో పాము పడినట్టు ఝల్లుపడి లేచాడు.

''అవున్నాన్నా!''

''ఒద్దమ్మా, కుక్కలు కరుస్తాయి తల్లీ చూడు, నన్నెలా కరిచేసిందో!'' అని పిక్క మీద కాటు చూపించాడు. అరచిన కుక్కలు కూడా కరుస్తాయని బోధించాడు. కాని లాభం లేకపోయింది. తండ్రికి తగ్గ కూతురు. ససేమిరా కొనితీరాలంది. ఆమరణ నిరాహారదీక్ష చేస్తానంది. రెండు మూడు గ్లాసులు గోడకేసి కొట్టింది. తుపాకీతో వెంటిలేటర్స్ అద్దాల్ని భళ్ళు భళ్ళుమని పేల్చేసింది. ఈ గొడవకి తట్టుకోలేకపోయాడు, రఘునాథరావు.

''సరేలే, తల్లీ; నీ ఇష్టం! కొంటానమ్మా. ఆ ఆనంద్‌గాడితో మూడుముళ్ళు వేయించేస్తే వాడే కుదురుస్తాడు.''

''పో, నాన్నా!'' అంది సిగ్గుతో. ఆనంద్ అంటే ఎంత ఇష్టమో ఆ సిగ్గులో స్పష్టంగా గోచరిస్తోంది. బెంగుళూరు నుంచి వెయ్యి రూపాయలు పెట్టి నిమిషాల మీద తెప్పించాడు కూతురు ముచ్చట తీర్చ డానికి కుక్కపిల్లని. కుక్క పిల్లను చూచి చెంగున గంతేసి ఎత్తుకొని ముద్దులాడింది. గుండెలకు హత్తు కుంది. స్వయంగా స్నానం చేయించింది. పౌడరు జల్లింది. ఆరోజంతా దాన్ని ఎత్తుకొని కూని రాగాలు తీస్తూనే ఉంది. మేరీ కుక్కపిల్లని ఎత్తుకొని ముద్దులాడుతుంటే మెడమీద గొంగళి పురుగు లు ప్రాకుతున్నట్లుండేది శునక ద్వేషికి. అంతటితో విడిచిపెట్టిందా, మేరీ? నా కుక్కకి బారసాల చేయించి పేరుపెట్టాలంది. కూతురు కోరిక తీర్చక తప్పుతుందా!

శునక నామకరణోత్సవానికి చిన్న నాటి స్నేహితుడు రిటైర్డు ఫారెస్టు ఆఫీసరు శామ్యూల్ని,

ప్రాణం మేరీకి కూడా పెళ్ళి చేసేస్తే

సెలవులకు ఇంటికొచ్చిన మేనల్లుడూ కాబోయే అల్లుడూఅయిన ఆనంద్‌బాబుని ఆహ్వానించాడు. నామకరణోత్సవం యథోచితంగా జరిగిపోయింది. నామధేయం ''విస్కీ'' అని రఘునాథ రావే పెట్టాడు ఆ పానీయమంటే అతనికిష్టమని.

ముఖ్యాతిథులకి ప్రత్యేకమైన విందు ఏర్పాటుచేశాడు. మేరీ స్వయంగా సర్వు చేస్తోంది. పలావు ప్లేట్లతోనూ, మత్తుపానీయాలతోనూ ఘుమ ఘుమలాడిపోతోంది. రెండో ఐటము తప్ప మొదట ఐటముని మూడుమార్లు మేరీతో వేయించుకుని మధ్య మధ్య మావయ్యతోనూ, శామ్యూలుతోనూ విట్లుకొడ్తూ, మేరీతో చాటుగా సరసాలాడుతూ తినేస్తున్నాడు ఆనంద్‌బాబు. పందొమ్మిది సంవత్స రాలుంటాయోమో; సన్నగా, రివటగా, పొడుగ్గా ఉంటాడు. చూడముచ్చటగా, వసపోసిన పిట్టలా అదే పనిగా వాగుతుంటాడు. మేరీ చలవరాతి బొమ్మలా వంటింట్లో నుంచి గదిలోకి, గదిలోంచి వంటింట్లోకి తిరుగుతూ వడ్డిస్తోంది. వంటింట్లోంచి ఆనందబాబుని వెక్కిరిస్తూనో, అల్లిక సూదిపెట్టి పొడుస్తాననో, కొరికిన అరటి పండు తింటావా అనో గిలిగింతలు పెడ్తుంటే మేరీని అమాంతంగా ఎత్తుకుని ఏ స్వర్గధామాల్లోకో పోదామనిపించేది ఆనంద్‌బాబుకి.

## 5

''టు ది హెల్త్ ఆఫ్ విస్కీ'' అంటూ శామ్యూల్ విస్కీ గ్లాసుకి తన గ్లాసుతో టకాయించి మెల్లగా సిప్ చేస్తూ, గదిలో టక్ టక్ టక్ మని బూట్లు చప్పుడు వినిపించేటట్లు పచార్లు చేస్తూ, మధ్య మధ్య తన నిండైన విగ్రహాన్ని నిలువుటద్దంలో చూసుకుంటూ బాతాఖానీ కొడుతున్నాడు జమీందారు రఘునాథరావు . శామ్యూల్‌కి ఇరుప్రక్కలా ఆనంద్‌బాబు, మేరీలు కూర్చున్నారు.

''నా యిష్టమయ్యా! నా కూతురు కోరింది. నేను కుక్కకి బారసాల చేయించాను. విశ్వాసం లేని మనుషులకే పేరు పెట్టడానికి వేలు తగలెయ్యగాలేంది విశ్వాసానికి మారుపేరు కుక్కకి నామ కరణోత్సవం చేయిస్తే లోకం నవ్వుతుంది. అక్కడే ఉంది, ఇరకాటం! అయినా శామ్యూల్, నా ఇష్టం, నా డబ్బు! నా డబ్బు పెట్టి కుక్కల్ని కొంటానో, వాటికి బారసాల చేయిస్తానో, సంబరాలు చేయిస్తానో వీళ్ళకెందుకయ్యా? నన్ను కామెంటు చెయ్యడానికి వీళ్ళు ఎవరూ అంటా! ఒక్కొక్కడిని చెట్టుకు కట్టి కొట్టించేస్తాను. నీకు తెలుసుకదా?''

''నీ జోరు చూస్తుంటే పిలిపించి మమ్మల్ని తన్నేట్టున్నావ్! అసలు సంగతి ఏమిటి మావ య్యోయ్! కాస్త చుక్క.....ఎక్...ఎక్'' అన్నాడు అనంద్‌బాబు నవ్వుతూ సూదిముక్కు జోడుకాలు స్టూలు మీద ఆడిస్తూ.

మేరీ కిల కిల నవ్వింది. ఒళ్ళో కుక్కపిల్లకి బిస్కెట్లు తినిపిస్తూ.

''గుంటడు గొప్ప విట్టుకొట్టాడయ్యా'' అన్నాడు మీసాలకి అంటిన విస్కీ బొట్టుని చేత్తో తుడుచుకుంటూ.

''వాడెప్పుడూ అంతేనమ్మా. ఎప్పుడూ జోరుగానే ఉంటాడు. స్కూల్లో చదివే రోజుల్లోనూ ఇంతే. వాడు చెప్పినదే కరెక్టని ఒప్పుకోవాలి. లేకపోతే చితక్కొట్టేసేవాడు ఎవరైనా సరే.'' అన్నాడు శామ్యూల్.

అప్పుడు ఏం చేస్తారో తనకే తెలీదు. కోపమే కాదు, ఆనందం వచ్చినా కూడా అంతే. ఏదొచ్చినా పట్టలేం'' అంది మేరీ.

''మరీ ఇదిగా చెప్పకు, మీ డాడీ సంగతి. చదువుకున్న రోజుల్లో స్కూల్లో వాళ్ళని తన్నడం కాదు ఒక గొప్ప.. వీపు తడిమి చూసుకోమను!'' అన్నాడు కట్ చేస్తూ ఆనందబాబు.

ఒక్కక్షణం పాటు ఆశ్చర్యంగా చూసి, మెల్లగా వీపు తడుముకొని, ఏమీ అర్థం కాక చటుక్కున వెనక్కు తిరిగి పేంటు లోంచి కమీజు బైటికి తీసి అందరికీ వీపు కనిపించేలా చూపిస్తూ ''ఏమిటిరా, ఏముంది? ఒరే, ఇది రాజావారి వీపురా. ఎకరన్నర వైశాల్యం, కావలిస్తే టేపు తెచ్చికొల్చుకో!'' అన్నాడు రఘునాథరావు.

''టేపు తెచ్చి ఇచ్చేదా, ఆనంద్?'' అంది మేరీ.

''నీ టేపు ఎవడికి కావాలి! రామాపురంలో పోలిగాడు మీ డాడీ వీపు ఈ కొస నుంచి ఆ కొసదాకా కొలిచాడు బడితె కర్ర పెట్టి! కావలిస్తే వాణ్ణి కనుక్కో తెలుస్తుంది.''

''వా...ట్?'' అంది సీరియస్‌గా మేరీ కనుబొమలు చిట్లిస్తూ.

నోట్లో విస్కీ గుక్క బయటకు చిమ్మేలాగ ఆపుకోలేక ఆపుకోలేక అమాంతంగా మేఘం గర్జించేలా ఒక్కసారి భళ్ళున నవ్వుతూ వికావికలై పొలబారిపోతూ ''అమ్మా.. ఆ గొప్ప సంగతి జ్ఞాపకం చేసేవురా .. ఎవర్రా, నీకు చెప్పింది? మీ అమ్మేనా?.. ఊఁ,.. అమ్మా.. ఆ.. ఆహ్హాహ్హాహ్హా''.. ఇంకా నవ్వు పట్టలేక పొట్టచేత్తో పట్టుకొని చేతిలో విస్కీ గ్లాసు బల్ల మీద పెడ్తూ, తెర తెరలుగా నవ్వి; ఎలాగైతేనేం మెల్ల మెల్లగా సంభాళించుకుని; ''ఓయ్ శామ్యూల్, నువ్వూ వినవలసిన సంగతే! బహుశా ఎప్పుడూ నీకు చెప్పలేదనుకుంటాను.. నువ్వూ వినమ్మా మేరీ... నేను ఒకసారి వేసవి సెలవులకు మా బావగారింటికి- అంటే వీడి బాబు ఇంటికి- వెళ్ళాను. అప్పుడింకా నువ్వు పుట్టలేదు.''

''అప్పుడింకా నీకు పెళ్ళికాలేదు. అమ్మాయి ఎలా పుడుతుంది మామయ్యా. నీకు పెళ్ళేఅయియుంటే ఆ పోలిగాడి పెళ్ళాం వెనకాలెందుకు పడతావు?''

''ఛప్ తన్నగలర్రా కుర్రా!'' అంటూ నవ్వుతూ లేవబోయాడు కొట్టడానికి.

''ఎప్పుడో పోలిగాడు నిన్ను తన్నాడని మధ్యను నన్ను తంతావేమిటి!.. అన్నట్టు, నీ వీపు వైశాల్య మెంత మామయ్యా? ఓయబ్బో ఎకరన్నరే!'' అని కొంటెగా కుర్చీలోంచి గంతేసి పక్కకు తప్పు కున్నాడు.

మళ్ళీ వస్తున్న నవ్వు తెరను ఆపుకుంటూ తాపీగా చెప్పడం మొదలెట్టాడు రఘునాథరావు. ''మాంచి గుర్రాన్ని ఒకదానిని రెండు నెలల క్రితం కొన్నారు, మా బావగారు; పూనాలో. దాన్ని చూడగానే స్వారీ చెయ్యాలనిపించింది. రైడింగ్ డ్రెస్ వేసుకుని గుర్రంమీద కూర్చుని మేడ మీద నుంచి చూస్తున్న మా అక్కకి, అలా షికారు వెళ్లొస్తానని చెప్పి హంటరు ఝుళిపిస్తూ చల్ మని డొక్కలో తన్ని దౌడాయించాను. శామ్యూల్; పంచకల్యాణంటే నమ్ము!.. గాలిలా పరుగులెత్తి పోతోంది. వీధులు, సందులు, బయళ్ళు, గుట్టలు దాటించి పొలాల గట్ల వెంబడి పరుగులెత్తించాను. వరికోతల కాలమేమో, అందరూ పనులు మాని అలా నివ్వెరపోతూ చూట్టం మొదలెట్టారు కొడవళ్ళని చేత్తో పట్టుకొని వాళ్ళమీదకు గాని గుర్రం దౌడుతీస్తుందేమోనని కొందరు ఆడాళ్ళు

''పాపం! మా డాడీకి తెలీకుండానే ఒక్కొక్కప్పుడు తగని కోపం వస్తుంటుంది అంకుల్. అటూ ఇటూ పరుగెడుతున్నారు. కొందరు కుర్రాళ్ళు కసెక్కిపోయి ఫర్ ఫర్ మని ఈలలు వేస్తున్నారు. ఆ ఈలలు విని మరింత రెచ్చిపోయి రెట్టింపు వేగంతో పరుగెత్తటం మొదలెట్టింది గుర్రం. ఇంతలో హఠాత్తుగా ఎర్ర చీర కట్టుకుని ప్రక్కనే నిల్చునున్న ఓ అమ్మాయి అమాంతంగా చేతిలో వున్న బుట్టల్నీ, కొడవల్నీ పక్కకుపారేసి ''ఒరేయ్, మావోయ్, సచ్చినోడు మీదకొస్తున్నాడ్రోయ్; ఎత్తుకు పోడానికి!'' అని కెవ్వున కేకేసి తడబడుతూ పరుగులెత్తి పారిపోబోతూ వరి దుబ్బును తన్నేసుకొని దబుక్కున బోర్లాపడింది. అంతే, శామ్యూల్! ఎక్కడనుంచొచ్చాడో గబ గబ ఒక నల్ల టోడు పరుగెత్తుకుంటూ వచ్చి ''నంజి కొడకా, నీ పని సఫా'' అని చేతిలో కర్రతో గొడ్డును బాదినట్లు దభీ దభీ మని బాదాడు. అదృష్టం బాగుంది కాబట్టి నా వీపుకు తగిలాయి. అందులో కేవలం ఒక్కటి నా తలకు తగిలుంటే ఈపాటికీ కథ ఉండేది కాదు. ఒక దెబ్బ గురి తప్పి పరుగెత్తు తున్న గుర్రం నడ్డిమీద ఢబాల్ మని తగిలింది. అది బాధతో హిహిహీ అని సకిలించు కొంటూ ఒక్కసారి రెండు కాళ్ళూ పైకిలేపి అంత జోరులోనూ గంతేసి వెనక్కి తిరిగి పరుగెత్తింది. లక్కీగా నేను క్రింద పడిపోలేదు. అంతా శూన్యంగా ఉంది నాకు. ఇదంతా ఏమిటో నాకు అర్థం కాలేదు. వీపు చిట్లి నెత్తురుతో కమీజు తడిసిపోయింది. కళ్ళు చీకట్లు కమ్మాయి. తల తిరిగి పోతోంది. అంతే, తరువాత ఏమయిందో నాకు తెలీదు. కుప్పలాగ వీపుమీద కూలిపోయిన నన్ను మోసుకుంటూ దానికి తగిలిన దెబ్బ బాధకి వెర్రికేకలు పెట్టుకుంటూ ఇంటిముందుకు వచ్చి ఆగిందట ఆ గుర్రం.''

''ఎవడ్రావాడు, నా తమ్ముణ్ణి కొట్టింది? అసలే తలలో నాలుక లేనివాడని అనువు చూచుకొని కొడ్తాడా? మా మోచేతి నీరు తాగే వెధవలకి ఇంత పొగరా? ఇంకా చూస్తారేమిటండి వాడెవడో వాకబు చేసి పోలీసు స్టేషన్‌లో పెట్టి చితక్కొట్టించెయ్యక!?'' అంటూ కారాలు మిరియాలు నూరు తోంది మా అక్కయ్య.

''ఉండవే ,అసలు ఏం జరిగిందో కనుక్కోనీ!.. రఘూ, రఘూ!'' అంటూ అప్పుడప్పుడే స్పృహలోకి వస్తున్న నన్ను అడిగారు మా బావగారు.

''నాకేం తెలీదు; గుర్రం జోరు చూసి ఓ ఆడది కెవ్వున అరిచింది.. అంతే.. నా వీపు...'' మరి చెప్పలేకపోయాను.

మరో గంటలో ఆ నల్లటాడ్ని పెడరెక్కలు విరిచి పెరట్లో గొడ్ల గుంజకు కట్టేసి చేతిలో టేకి తోక పట్టుకొని విచారణ ప్రారంభించారు బావగారు.

''నువ్వేనా కొట్టింది?''

''అవును, బాబయ్యా''

''కళ్ళు బైర్లు కమ్మాయా?''

''నాటకంలో లాగ మాట్లాడుతారేమండీ; చీల్చెయ్యక, గాడిద కొడుకుని?'' అంది పరదా చాటునుంచి నిప్పులు కక్కుతూ అక్కాయ్.

''నువ్వుండక్కయ్యా. నీ పేరేమిటి?'' అన్నాను దగ్గరగా వెళ్ళి–

''పోలయ్య''– ఏడుస్తూ

''నన్నెందుకు కొట్టావ్?''

అనుకుని మా ఆడది కెవ్వున కేకెట్టింది. తొందర్లో ఆడే అనుకొని మిమ్మల్ని కొట్టేసినాను.. రచ్చించండి బాబయ్యా. పొరపాటైపోనాది, మీ పాదాలట్టుకుంటాను. మీ పంచని బతికినోడ్ని.

''సులైమానైతే మాత్రం ఎందుకు కొట్టాలి?''

''నంజికొడుక్కి పేగులు తోడేత్తాను. గుర్రంమీదొచ్చి పొలాల్లో ఆడోళ్ళని అల్లరిచేస్తుంటాడు. రోజూ ఆడితో మహా గొడవగా ఉంది బాబూ.. తప్పయిపోనాది, చమించండి బాబూ! మీ కాళ్ళట్టుకుంటాను!'' అంటూ బావురుమన్నాడు.

''భేష్, మంచి పనిచేశావ్. పొరపాటున కొట్టావు కదూ, ఆల్‌రైట్ ఫరవాలేదు. సులైమానైతే చంపే స్తావు కదూ చంపేయ్! నరికెయ్యి, బాస్టర్డుని! ఇంద ,ఇది తీసుకో !'' అంటూ నేను స్వయంగా వాడి కట్లు విప్పి పాతిక రూపాయలు బక్షీసిచ్చాను.

''పొరపాటైతే మాత్రం, వీపు చితికిపోయిందిరా! ఊరుకుంటూ విడిచిపెట్టాశావేం?'' అంటోంది అక్క .

''ఊరుకో అక్కా, వీడు కరెక్టయిన మనిషి! ముందా సులైమాన్‌ని ఉద్యోగంలోంచి తీసేస్తే బాగుం టుంది.''

''ఒరేయ్! గుర్రపోడు రేపట్నుంచి మన దివాణంలో అడుగుపెడితే మక్కలిరగ దన్నండి'' అని ఆర్డరు పాస్ చేశారు బావగారు.

''సులైమాన్‌కి బర్తరఫ్ ఇచ్చేసారు. పోలయ్య ఇప్పటికీ వీళ్ళ ఊరిలో కనిపిస్తూ ఎప్పుడో చేసిన పొరపాటుకు ఇప్పుడు కూడా ఇదైపోతుంటాడు. నేను ఆనవాయితీ ప్రకారం పాతిక బక్షీసు ఇస్తూనే ఉంటాను...''

''వీపు కూడా తడుముకుంటూనే యుండును !'' అన్నాడు ఆనంద్.

''వ్యాకరణం వెలిగిస్తున్నాడండోయ్, గుంటడు!'' అన్నాడు రఘునాథరావు రామప్ప పంతులు ఫోజులో.

''అమెరికాలో చదివే దొరలకి తెలుగు వ్యాకరణమా?'' అంది ఆశ్చర్యంగా బుగ్గమీద వేలుమీటు కొంటూ మేరీ.

''ఊ అందుకు సందేహమా!'' సడన్‌గా రిప్లయిచ్చాడు, కుర్చీలో ఠీవిగా రిలేక్సవుతూ. ''వెరీ విట్టీబోయ్'' అన్నాడు శామ్యూలు, ఆనంద్‌బాబు చలాకీతనానికి మురిసిపోతూ. ''అఖండుడోయ్! నాకు ఆట పట్టించడం వీడికో సరదా. బైదిబై ఐ యామ్ సారీ, శామ్యూల్! వీడ్ని ఇంతసేపటి నుంచి నీకు పరిచయం చేయడం మరిచిపోయాను. నా మేనల్లుడు ఆనంద్‌బాబు. అమెరికాలో చదువు కుంటున్నాడు. క్రికెట్టు, షూటింగ్ అంటే మహా పిచ్చి. ఇతను నా బాల్య స్నేహితుడు రిటైర్డు ఫారెస్టు ఆఫీసరు. శామ్యూల్. ఏ ఫేమస్ టైగర్ హంటర్.

''వెరీ గ్లాడ్ టు మీట్ యు సార్. మేనీటర్సుని ఏమైనా కొట్టారా?''– అడిగాడు ఆత్రుతగా ఆనందబాబు.

''డజనుకి పైగా.'' అన్నాడు రఘునాథరావు.

''ఏదోలే, మీ మామ మరీ కోస్తాడు. యు ఆర్ ఆల్సో ఇంటరెస్టెడ్ ఇన్ షూటింగ్ ఈజిన్‌టిట్? గుడ్! ఎప్పుడైనా షూటింగ్ కాంపిటీషన్స్‌లో పాల్గొన్నావా? అయామ్ సారీ; ఏకవచన ప్రయోగం

చేస్తున్నాను. నీ దగ్గర నాకు అంత చనువుగా ఉండాలని ఉంది. ఆఫ్ కోర్స్, ఇఫ్ యు డోన్ట్ మైన్డ్.

''నో, నో! నాకు మామయ్య ఎంతో మీరు అంతే. ట్రాప్ షూటింగ్‌లో మొన్ననాకు మా క్లబ్బులో ప్రైజొచ్చింది.''

''కంగ్రాట్యులేషన్స్. నేను పిట్టల వేటలో పూర్తిగాఫ్లాప్‌ని. రఘు బాగా కొడ్తాడు. ప్రత్యేకించి స్నయిప్ షూటింగ్'' అన్నాడు శామ్యూల్.

''ఏరా, ఆనంద్; బెట్ చేస్తావా, స్నయిప్ షూటింగ్‌లో? చూస్తాను, నీ అమెరికా ట్రాప్ అనుభవం!'' అన్నాడు మీసాల్ని ఎగదువ్వుకుంటూ.

''నీతోనా!.. ప్చ్, ఓల్డ్ హాగ్!''

''భయంగా ఉందా, యంగ్ బోయ్?''

''నాటింది లీస్ట్, యూ నాటీగర్ల్!''

''ఒరేయ్, ఇంకెందుకు పోనీ! మా మేరీతో బెట్ చెయ్యి చూద్దాం ·22 బోర్ రైఫిల్ షూటింగులో!''

''శామ్యూల్, ·22 బోర్ షూటింగ్‌లో మేరీ మాంచి షాట్ తెలుసా? మొన్న లైన్స్ క్లబ్బులో, సార్జెంటు వైఫ్ మిసెస్ వుడ్‌ని; టార్జెట్టు షూటింగులో చిత్తుక్రింద కొట్టేసింది!'' అన్నాడు సగర్వంగా రఘునాధరావు.

''గొడకి కొట్టిందా? అదీ గొప్పే?''

''గోడక్కాదురా కుర్రా. బెట్ కాస్తేనీ నోట్లో కాలుతున్న సిగరెట్టుని కొట్టేస్తుంది, వంద గజాల దూరం నుంచి· 22 రైఫిల్‌తో''.

''మామయ్యా, నేను మా అమ్మకీ నాన్నకి ఒక్కణ్ణే కొడుకుని.''

మేరీ గొల్లున నవ్వింది. ఆనంద్ కూడా నవ్వుకలిపాడు. వాళ్ళిద్దరూ అలా నవ్వుతుంటే శామ్యూల్ కి, రఘునాధరావుకి మాహా ఆనందంగా ఉంది.

టైగర్ హంటరు శామ్యూల్.

బాతుల వేటగాడు జమీందారు రఘునాధరావు.

ట్రాప్ షూటింగ్‌లో అనుభవంగల ఆనందబాబు.

చిన్నసైజు రైఫిలు షూటింగులో ఆసక్తి గల మేరీ.

భోజనానంతరం కూర్చొని బాతుల వేటకి వెళ్దామని ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నారు. మరుసటి రోజు పులి చెఱువులో పిట్టల వేటకి రెడీ అంటే రెడీ!

## 6

పొగమంచు కురుస్తోంది. తెల తెలవారుతోంది. దూరాన ఎక్కడో కోళ్ళు కూస్తున్నాయి. పులి చెరువులో పిట్టలు కిచ కిచ లాడుతూ రొదచేస్తున్నాయి. క్రమేణా తూర్పు ఎర్రబారుతూంటే మంచు కరిగిపోతోంది. మంచు పరదాల్లోంచి దూరాన మసగ్గా కనపడే కొండలు, వాటి వెనకాలే లేత ఎరుపు పూసుకున్న ఆకాశం అతి రమణీయంగా వుంది.

పులి చెరువని దానికి ఎందుకు పేరొచ్చిందో తెలీదు. పూర్వం పులులు ఆ చెరువులోనే నీళ్ళు

తాగేవంటారు. కాని, నమ్మడానికి వీలులేదు. ఎందుకంటే ఆ చుట్టుపక్కల పాతిక మైళ్ళ దూరంలో అడివంటూ లేదు. నీళ్ళు తాగడానికి పులులు ఈ పాతిక మైళ్ళు పనికట్టుకొని నడిచివచ్చేవంటే నమ్మకం చాలదు. అయినా దీని గురించి తల బద్దలు కొట్టుకోవటం దేనికి! మొత్తం మీద చెరువు పేరు పులి చెరువు– పులి చెరువులో పిట్టలు గుంపులు గుంపులుగా ఉంటాయి చలికాలంలో.

రెండు పడవల నిండా వేటసామాగ్రి నింపారు. కాఫీలు ఆరగించి మిగతాది ఫ్లాస్కులో నింపుకొని పట్టుకున్నారు. మేరీ ఊలు కోటు వేసుకుని కుక్కపిల్లని ఎత్తుకొని వేట సరంజామా అంతా పర్యవేక్షిస్తోంది. ఆనంద్‌బాబు వెస్ట్రన్ డ్రెస్‌లో కౌబోయ్‌లా ఉన్నాడు. భుజానికి వేళ్ళాడే జోడుగుళ్ళ తుపాకీ అతనికి మాంచి హుందా నిస్తోంది. మధ్య మధ్య మేరీ ఆనంద్‌బాబులు కళ్ళతో మాట్లాడు కుంటున్నారు. పని ఉన్నా లేకపోయినా కలగజేసుకుని అటూ ఇటూ పరుగెత్తుతూ అందిన రాయిమీద చెట్టుమీద వంగుతూ వాల్తూ ఆనంద్ పోజులు కొట్టడం గ్రహించి ఉండి ఉండి కిసుక్కుమని నవ్వుకుంటోంది మేరీ . భుజాన కుక్కపిల్ల కదులుతూ గిలిగింతలు పెడుతోంది.

నల్లని ఊలులాంగుకోటు , మంకీహేటు వేసుకొని హవానా చుట్టకాలుస్తూ చేతికర్ర హుందాగా ఆడిస్తూ రఘునాధరావు , ఆ వెనకాలే కాకీ డ్రెస్సులో శామ్యూల్; ట్రావెలర్స్ బంగళా మెట్లు దిగుతూ వచ్చారు.

''హల్లో, మామయ్యా ; లెటజ్ స్టార్ట్!'' అంటూ చెరువు ఒడ్డు నుంచి బూట్స్ చప్పుడు గట్టిగా వినపడేలా టక్ టక్ మని పరిగెత్తు కుంటూ వచ్చి, మామయ్యతో చెయ్యి కలపబోయి; కంకర రాళ్ళ మీద జర్ మని జారి, రెండు మూడు పల్టీలు కొట్టి మేరీ కాళ్ళ దాకా దొర్లుకుంటూ వచ్చి పడ్డాడు.

''వెరీ సారీ ఆనంద్! మరీ పోజు లెక్కువైపోతే ఇదే అనర్థం. డోన్ట్ మైండ్ , గెటప్'' అని మేరీ ముసి ముసి నవ్వులు నవ్వుతుంటే ఆనంద్ బాబుకి ఐసు సముద్రంలోకి దిగిపోతున్నట్టనిపించింది. ముణుకులు చెక్కుకుపోయినా.

ఈ శబ్దానికి అదిరిపోయి చంకలో కుక్కపిల్ల భౌభౌ మని సన్నగా అరవడం మొదలెట్టింది.

''కీప్ క్వయిట్, యూ నాటీ బోయ్!.. అరవకు. మన ఆనంద్ బాబు ఫీట్సు చేశాడు, అంతే!''

''ఓరి కుర్రవెధవా, పదడుగులు పరుగెత్తలేనోడివి నువ్వేం వేట చేస్తావురా?'' అంటూ ఆనంద బాబు వీపుకి అంటుకున్న బురదను దులిపాడు రఘునాధరావు.

''దట్‌సాల్ రయిట్! ఫరవాలేదు. దెబ్బలేమీ తగల్లేదు కదా! ఇహ మనం బయలు దేరాలి, టైమ్ అయిపోతోంది!'' అని మెడలో తగిలించుకున్న బైనాక్యులర్స్ తీసి చెరువంతా కలయచూస్తున్నాడు శామ్యూల్.

''అబ్బే, అబ్బే; ఏం కాలేదండి; కాస్తంత కాలుజారింది. అంతే! హిహ్హిహ్హి ''అని నవ్వుతూ చెక్కుకు పోయిన ముణుక్కి ఉమ్ముతడి తగిలించుకొంటూ మేరీ వైపు చూశాడు; మళ్ళీ ఆ అమ్మాయి నవ్వితే బాగుణ్ణని.

''పిన్ టెయిల్స్, రెడ్ హెడ్ బాతులూ బాగా ఉన్నాయి. బాగా బేచెస్‌లో ఉన్నాయి. అక్కడక్కడ జమ్ము కోళ్ళ కూడా ఉన్నాయి. ఆలస్యం చేస్తే బేచెస్‌గా ఉన్న బాతులు చెదిరి పోవచ్చు. బయలుదేరండి. ఊఁ,! క్విక్ అంటూ, శామ్యూల్ పడవలో వున్న తుపాకీ పెట్టెలు తెరిచాడు.

శామ్యూల్ జోడుగుళ్ళ తుపాకీ, రఘునాథరావు ఐదు తూటాలు వరసగా పేల్చడానికి వీలయిన పంప్ యాక్షన్ తుపాకీని తీసుకున్నారు. తూటాల పెట్టెలు తెరచి కోటు జేబులో తూటాలు నింపుకున్నారు.

''నీ తుపాకీ తియ్యమ్మా, మేరీ! ఆ కుక్క పిల్లని కాస్తకిందికి దింపు తల్లీ!''

''నువ్వు కాస్త దీన్నిపట్టుకోనాన్నా. కిందికి దింపుతే చిన్నముండ కాళ్ళంతా బురద చేసుకుంటుంది. అని కుక్కపిల్లను తండ్రికి అందించి పడవలోని తుపాకీ పెట్టి తెరచి ముఖమల్ కుషన్ మధ్య భద్రంగా దాచిన దూరదర్శిని అమర్చబడిన చిన్నసైజు 22 బోర్ రైఫిల్ తీసింది. బోల్టు యాక్షన్ సరిచూసు కునేందుకు రెండుమూడుసార్లు ముందునుంచి వెనక్కి బోల్టును కడకడ లాడించి, ఓకే అనుకొని, భుజానికి తుపాకి ఎత్తి ఎడమకన్ను మూసి టెలిస్కోపిక్ సైటు గుండా కుడి కన్నుతో గురిచూస్తూ చెరువుమీద తుపాకీని మెల్ల మెల్లగా తిప్పుతూ అలా అలా ఒడ్డుమీదికి తిప్పింది. అల్లంత దూరంలో నిన్నటి నుంచీ జమ చేసి పట్టుకొచ్చిన రబ్బరు బుంగల్లో నీరు నింపుతున్న ఆనంద్‌బాబు దూరదర్శినిలో సూటిగా కనిపించాడు. సన్నగా రివటలాగ ముచ్చటగా మోకాళ్ళ మీద కూర్చుని బుంగలో నీరు నింపు తున్న ఆనంద్‌బాబు మీద నుంచి దృష్టి మరల్చలేక పోయింది మేరీ. ఆనందబాబు దూరదర్శిని ఫోకస్‌లో మరింత అందంగా ఆనందంగా కనిపిస్తున్నాడు.'' అమ్మా, నీ కుక్కని తీసుకోతల్లీ; మూతి నాకేస్తుంది'' అన్న తండ్రి మాటల్తో ఎక్కడో విహరిస్తున్న మేరీ త్రుళ్ళిపడి ఈ లోకంలో పడింది.

''విస్కీకి మామయ్య మూతి మీద మోజు ఎక్కువ కలిగినట్టుంది. ఏంటి సంగతి మామయ్యా ఏం వాసన కొడుతుందో ఏమో!'' అని కన్నుగీటి ఎక్ ఎక్‌మని రెండుసార్లు తాగినవాడిలా బెక్కుతూ శామ్యూల్‌వైపు చూశాడు. అందరూ గొల్లుమని నవ్వారు. కుక్కపిల్ల కూడా కుయ్ కుయ్ మని నవ్వింది.

''సైలెన్స్, సైలెన్స్! హియర్ మీ!'' అంటూ ముగ్గురి మధ్యకూ తోసుకుంటూ వచ్చి చేతుల్ని నడ్డి మీద ఆనించి వెదురు బద్దలా వెనక్కి వంగి ఉపన్యాస ధోరణిలో ''డియర్ లేడీస్ అండ్ జంటిల్ మెన్! మనం, ఈరోజు, ఇక్కడ, ఇప్పుడు; ఎందుకు సమావేశమయ్యామో అందరికీ తెలిసిన విషయమే. శ్రీశ్రీ రఘునాథరావు జమీందారుగారి సుపుత్రికారత్నం కన్నె మేరమ్మ పెంచుతున్న కుక్కపిల్ల బారసాలని పురస్కరించుకొని; మనం, అంటే మనమందరం ; డక్ షూటింగ్ అంటే బాతుల వేటకి బయలుదేరబోతున్నాం. ఈ శుభ సందర్భంలో మేరీ, వాళ్ళ డాడీ గ్యాస్ కొట్టినట్టు 22 బోర్ రైఫిల్ షూటింగ్ లో తన ప్రావీణ్యతను, అందరూ చూసి మెచ్చుకొని ఆమెకు మేకతోలు కప్పేటట్టుగా ప్రదర్శి స్తుందని విశ్వసిస్తున్నాను!'' అని ఒక్క బిగిని గుక్కతిప్పకుండా చెప్పాడు ఆనంద్‌బాబు. ''సోడాలైనా లేవే, ఈ కుర్ర వెధవ గొంతుకు అర్చుకుపోయింది... ఒరేయి నువ్వు ఆ రాయి దగ్గర నిలబడ్రా. నీ టోపీని ఎగరగొట్టేస్తుంది మేరీ..... అమ్మా, నువ్వు రైఫిల్‌లో గుళ్ళు పేర్చు !'' అన్నాడు రఘునాథరావు.

''తల్లితండ్రులకు ఒక్కడే కొడుకునని చెప్పానుగా, మావయ్యా! ఏం, మేరీ; ఆల్‌రైట్! ఇదిగో నీరు నింపిన రబ్బరు బుంగలు. ఆ రాయి మీద నిల్చుంటా, చెరొకటి చేత్తో పుచ్చుకుని. రెండు షాట్స్‌తో రెండిటినీ కొట్టేయ్యాలి– నీ పుణ్యముంటుంది, నా జబ్బ ఊడదీసెయ్యకు.'' అంటూ

పరుగెత్తుతూపోయి ఇరవై గజాల దూరంలో ఉన్న రాయిమీద నిల్చున్నాడు. రబ్బరు బుంగల్ని చెరో చేత్తో గట్టిగా పట్టుకుని చేతుల్ని బార్లాచాచి ''ఎస్, రెడీ!'' అన్నాడు ఆనంద్ బాబు. ''తుపాకీ వైపు చూడకు , జడిసి పోగలవు! గట్టిగా కళ్ళు మూసుకుని ఆంజనేయదండకం చదువుకో!'' అన్నాడు రఘునాథరావు చేతికర్రమీద ఆనుకుంటూ.

''మరేం ఫరవాలేదు మామయ్యా. . ఓశ్, ఓహో! ఫోజు ! ఇంకెంత సేపు, కానీ!'' అన్నాడు బిగుసుకు పోతూ ఆనంద్.

''యూ సిల్లీ బోయ్. చూప్!'' అంది చిలిపిగా చూస్తూనే మేరీ.

''రెడీ, వన్; టూ,'' .. కౌంటు చేస్తున్నాడు రఘునాథరావు

''త్రీ!''

''ఠాప్, ఠాప్'' మని తుపాకీ పేలింది. బుంగలు తుప్ తుప్ మని చిట్లిపోయాయి. ఆనంద్‌బాబు ముఖం మీద నీళ్ళు జల్లుమని చిమ్మాయి. నోట్లోకి, ముక్కులోకి కూడా దూరిపోయాయి.

''వెల్ డన్ మేరీ, వెల్ డన్! అంటూ ఉక్కిరి బిక్కిరైపోతూ నోట్లోకి పోయిన నీళ్ళని ఉమ్మేకుంటూ, చేతుల్తో ముఖం తుడుచుకొంటూ; పరుగు పరుగున మేరీ దగ్గరకు వచ్చి ''కన్‌గ్రాచు లేషన్సు!'' అని చెయ్యి కలపబోయాడు. మేరీ చెయ్యిని వెనక్కి లాక్కొంది;'' ప్రక్కన మనుషు లున్నారు, జాగ్రత్త!'' అన్నట్లుగా చూస్తూ.

''తోకముడుచుకోరా డామిట్. చూశావా, అమ్మాయితడాకా?'' అన్నాడు సగర్వంగా రఘునాథ రావు.

''చాలా బాగా కొట్టావమ్మా. వెరీ ఫైన్!'' అంటూ శామ్యూల్ కోటు జేబులోంచి చాక్లెట్ తీసి మేరీకి రఘునాథరావుకి తలా ఒకటిచ్చి ఆనంద్‌కి కూడా ఇవ్వబోతుండగా....

''వాడికెందుకోయ్, ఓడిపోయింది కాకుండా!'' అంటూ ఇవ్వకుండా వారించాడు శామ్యూల్ని రఘునాథరావు.

''సరండరైపోయాను మామయ్యా; ఇంకెందుకు! పోనీ, గుంజీలు తియ్యమంటావా; తీస్తాను!''

''తీస్తానంటే కాదోయ్, తియ్యి!''

''అంతేనంటావా? ఒకటి...'' అని చెవులు పట్టుకుని మేరీ వైపు చిలిపిగా చూస్తూ తియ్యడం మొదలెట్టాడు.

''మరీ ఆట పట్టించకు రఘూ; నువ్వు మరీ కుర్రాడి వైపోతున్నావు! ఇదిగో చాక్లటు తీసుకో ఆనంద్. ఇహ బయల్దేరండి; ఇప్పటికే చాలా ఆలస్యమైంది!'' అంటూ వేట ప్రయాణానికి సిద్ధ మయ్యాడు శామ్యూల్.

''నాన్నా నేనూ ఒక జట్టు...''

''శామ్యూల్ గారూ, నేనూ ఒక జట్టు'' అంటూనే మేరీతో కలిసి పోతేనే బాగుండునని లోలోన మదన పడిపోతున్నాడు ఆనంద్ బాబు.

'' అంహఁ, అలా కాదమ్మా; నువ్వూ వాడూ కలిసి ఒక పడవ ఎక్కండి. ఇంతటితో వీడ్ని ఇలా విడిచి పెట్టేస్తే లాభం లేదు. నీ షూటింగ్ తడాకా చూసి వీడు సిగ్గుతో కృంగిపోవాలి. కబుర్లు కాదు! ఇప్పుడైతే గుంజీలు తప్పించుకున్నాడు. వేట ఆఖరికి ఎవరు తక్కువ పిట్టలు కొడితే వాళ్ళు డజను

గుంజీలు తియ్యాలి. శామ్యూల్! . ముందే చెప్తున్నాను. తరువాత నువ్వు అడ్డుకున్నా లాభం లేదు? అమెరికా ట్రాప్ షూటింగు చాంపియన్ ఆట! మొనగాడు. చూద్దాం వీడి కోతలు. నువ్వెళ్ళి ఆ పడవలో కూర్చోమ్మా.''

''ఆహా ఈవిడతోనైతే వేట చేసినట్టే! కొట్టబోయేది ఎగిరే పిట్టల్ని, ఈదే పిట్టల్ని; టార్గెట్టుల్ని, రబ్బరు బుంగల్ని కాదు!.. హుం! అంటూ బైటకి విసుక్కుంటూ మేరీ ఎక్కిన పడవలో ఎక్కాడు జోడు గుళ్ళ తుపాకీ సరిజేసుకొంటూ. మనస్సులో మాత్రం, మేరీ దగ్గరగా కూర్చొని కబుర్లాడు కుంటూ వేట చేసే ఛాన్సు దొరికినందుకు గొప్ప కులాసాగా వుంది.

''కూర్చోడం కాదు. నువ్వు పడవ నడపాలి.''

''హరి భగవంతుడా; ఏం ఖర్మరా!'' అని గొణుక్కుంటూ తెడ్డు వెయ్యటం మొదలెట్టాడు. పడవ మొత్త మీద రైఫిలు పట్టుకొని మేరీ కూర్చుంది. కాళ్ళ దగ్గర కుక్కపిల్ల పడుకుని చూస్తోంది. ఏమీ అర్ధంకాక.

రెండవ పడవలో శామ్యూల్, రఘునాధరావు కూర్చున్నారు. ''నేను వేసిన ప్లాను చూశావా'' అన్నట్లు శామ్యూల్ వైపు చూసి సన్నగా నవ్వాడు రఘునాధరావు, ''ముందే గ్రహించానులే'' అన్నట్టు నవ్వుతో సమాధానం చెబుతూ పడవ కదిలించాడు. తెడ్డు వేస్తూ శామ్యూల్.

''విష్ యు బెస్ట్ ఆఫ్ ది లక్!''

''విష్ యూ ది సేమ్!'' అంటూ రెండు జట్లూ ఉత్తరానికి, దక్షిణానికి చెరొకటిగా విడిపోయాయి. పడుచువాళ్ళ పడవ ఉత్తరానికి, ముసలి వాళ్ళ పడవ దక్షిణానికి బయలుదేరాయి. బాతుల వేటకి...

## 7

పులి చెరువు సుమారు రెండు మైళ్ళ పొడవుంటుంది. కుడివైపున ఆనుకొని సుదీర్ఘ పర్వతశ్రేణి ఎడమవైపు అక్కడక్కడ నల్లరాతి గుట్టలు, సరిగ్గా కొలిచి గట్టుకట్టినట్లు చెరువు మధ్యన ఎడమవైపు గట్టు నుంచి నీటి లోపలికి కొంత వరకూ చొచ్చుకుపోయిన ఒక నల్లరాతి గుట్ట చూడటానికి అందం గా ఉంది. దూరం నుంచి చూస్తే చెరువు రెండు భాగాలుగా విడిపోయినట్లు కనిపిస్తుంది. మధ్యనున్న గుట్ట వల్ల. గాని ఇవతల భాగం నుంచి పడవలు గుట్టచుట్టూ తిరిగి ఆవలి భాగానికి వెళ్ళడానికి తగి నంత జాగా వుంది. కుడివైపు పర్వత శిఖరం మీద ఒక పెద్ద కొండరాయి గట్టిగా ఊపిరి పీలిస్తే కదిలి రాలిపోయేటట్టు తేలిగ్గా ఆనుకుని చెరువు మీదికి భూతంలా వాలి వుంది , కొన్ని వందల సంవత్సరాల నుంచి.

మేరీ, ఆనంద్‌ల పడవ పడుచుదనపు హొయలుతో నాచును తోసుకుంటూ పయనిస్తోంది. ఆనంద్ తెడ్డు వేస్తున్నాడు. మేరీ పిట్టల్ని చూస్తోంది. సూర్యకిరణాలు మేరీ ఎర్ర ఊలుకోటు మీదపడి మంచుబొట్టుల్లో ప్రతిఫలిస్తూ వినూత్న కాంతుల్ని విరజిమ్ముతున్నాయి. ఉదయాన్న వేస్తున్న చలిగాలుల తాకిడికి మేరీ ముఖం మీద రింగులు తిరిగిన ముంగురులు అల్లలలాడుతుంటే తన్మ యత్వంతో చూస్తున్నాడు, ఆనంద్‌బాబు. చెరువు నిండా తామరాకులూ వాటిమీద ముత్యాల్లాంటి నీటి బిందువులు, పెన వేసుకున్న నాచు; మధ్య రక్తారుణ వర్ణంలో వికసిస్తున్న ఎర్రకలువలు, వాటి

మీద వాలె నల్ల తుమ్మెదల గుంపులతో ప్రకృతి అతి రమణీయంగా, నేత్రపర్వంగా ఉంది. ఆ ప్రశాంత ప్రకృతి మధ్య పడుచుతనపు కోర్కెల్ని నింపుకున్న అబ్బాయి, అమ్మాయి.

అమ్మాయితో మాట్లాడాలని అబ్బాయి నీళ్ళు చిమ్మాడు.

అమ్మాయి ఒళ్ళు పులకరించింది. హృదయ వీణను ఎవరో మీటినట్టయింది. సిగ్గు ముంచేస్తోంది. చిరుకోపం ముక్కుమీద స్పష్టాస్పష్టంగా గోచరించింది. సిగ్గులోని చిరుకోపంతో ''ఏమిటిది? మా నాన్న చూస్తాడు.. పిట్టల వేటకొచ్చి సరసాలేమిటి?'' అంది.

ఏదో సమాధానం చెప్పబోయాడు కాని ఏమిటి చెప్పాలో స్ఫురించలేదు.

పడవ గుట్ట చుట్టూ తిరిగి ఆవల భాగంలో పడింది. ముసలి వాళ్ళ పడవ కనుమరుగైంది. ఏం మాటలు కదపాలా మేరీతో అని తలబద్దలు కొట్టుకుంటున్నాడు ఆనంద్ బాబు. ఉండుండి నెత్తి మీద నుంచి బాతులు అరుచుకుంటూ ఎగిరి వెళ్తున్నాయి. అవేమీ వీళ్ళ కర్ణపుటాలకి సోకడం లేదు. బాతుల వేట మరచి పోయారు. మరి మరిచిపోరూ...!

''నాతో పడవలో రానన్నావుగా, ఎందుకొచ్చావు?'' అంది మేరీ, వంగి తామరాకుల మీద కుడి చేత్తో నీళ్ళు తుళ్ళిస్తూ.

''అయామ్సారీ, కోపమొచ్చిందా?'' తెడ్డెయ్యడం ఆపుతూ.

''ఊఁ.....''

''దాసరి తప్పులు దణ్ణంతో సరి.'' దణ్ణం పెడుతూ.

ఆపుకోలేక ఫక్కున నవ్వింది. కోటిమల్లెలు వికసించినట్లయింది.

''అట్టే నవ్వకు. వచ్చే వాడి కోసం కాస్త భద్రంగా దాయి''.

''ఛీ, పో!''.. సిగ్గుతో ముఖానికి చేతులు కప్పుకుని వేళ్ళ సందుల్లోంచి కొంటెగా చూసింది ఆనంద్‌బాబు వైపు.

ఆనంద్ బాబు తెడ్డు వెయ్యటం ఆపినా, పిల్ల కెరటాల తాకిడికి మెల్లగా పడవ కదుల్తూనే వుంది. అమ్మాయి క్రీగంటి చూపులకు సమ్మోహితుడై పోతూ ఆనంద పారవశ్యంతో చిన్న ఇంగ్లీషు ట్యూను ఈల వేస్తూ తిరిగి తెడ్డు హుషారుగా, జోరుగా వెయ్యనారంభించాడు.

జంయ్ మని పరుగులు తీసింది పడవ, నాచును చీల్చుకుంటూ. పడవ కింద పడి నీటిగడ్డి చిటపటలాడుతోంది. గట్టుపైన మామిడి చెట్టు మీద కోయిల కూస్తోంది. పరదలు (చిన్నసైజు బాతులు) ఒకదాన్నొకటి తపతప రెక్కలు కొట్టుకుంటూ వెంటాడుతున్నాయి. తన ఈలపాటకి లయగా మేరీ కాళ్ళు కదుపుతుండడం ఆనంద్ బాబు గ్రహించాడు. టకటక మని మేరీ చేసే లయ బద్ధమైన కాలిజోళ్ళ చప్పుడు ఆనంద్ హృదయానికి కోటి అప్సరసల కాలి అందియల మ్రోతగా వినిపించింది.

''ట్విస్టా?'' అన్నాడు.

''నేనేం దొరసాన్ని కాదుగా!''

''పోనీ ఊర్వశివే అనుకో, చేసేదేదో పూర్తిగా చెయ్య రాదూ?''

''ఉహూ.. అటుచూడు!''

''ఏమిటి?''

''కొంగ, నీలాగే జపం చేస్తోంది.!''

''దేవి సాక్షాత్కారం కోసమేమో?''

దిక్కులు పిక్కటిల్లేలా ఢాం, ఢాం, ఢాం మని తుపాకీ కాల్పులు వినవచ్చాయి, చెరువు ఆవలి భాగం వైపు నుంచి. అంతవరకు ప్రశాంతంగా ఉన్న ప్రకృతి కల్లోల పడిపోయింది. ఈదుతున్న పిట్టలు జంయ్ జంయ్ మని లేచిపోయాయి. కొంగలు కొక్కొక్ మని గోలచేస్తూ భయంతో ఎగిరి పోతు న్నాయి. తీతువ పిట్టలు బెదిరిపోయి ''టిట్టిటిటివ్ టిట్టిటిటివ్'' మని అరుచుకుంటూ వలయా కారంగా నీటిమీద తిరుగుతున్నాయి. నీటి ఒడ్డున కప్పలు అదిరిపోయి తుప్ తుప్ తుప్ మని నీట్లో దూకుతూ దాక్కొంటున్నాయి. పాముల నారి (పెద్దసైజు కొంగ) కార్, కార్, క్క్, క్క్ మని అని అరుచు కుంటూ రాతిగుట్ట మీద కూర్చొని బిత్తరి చూపులు చూస్తోంది.

ఆనందబాబు ఛటాలున తుపాకీ తీసి ''మేరీ! బీ రడీ. ఈవైపు బాతుల మంద వస్తోంది.''

మేరీ నిల్చొని నీ రెండకు చెయ్యి అడ్డం పెట్టుకుంటూ దూరాన వస్తోన్న బాతుల మందని చూసి ''ఉశ్, చాలా పెద్ద బేచ్ ఆనంద్! నీ తుపాకీతోనే కాల్చు.. టప టప రాలిపోవాలి.''

తుపాకీ మోతకు అదిరిపోయిన వందలాది బాతులు పెద్ద మందగా జంయ్ మని వస్తున్నాయి. దూరానికి మబ్బు కదలి వస్తోందా అన్నట్టుగా ఉంది., బాతులు ఇంకా దూరంలో ఉన్నా వాటిసవ్వడి స్పష్టంగా వినిపిస్తోంది.. రాను రాను బాతుల గుంపు దగ్గరౌతుంది.

తుపాకీ భుజానికి ఆనించి గురిపెడ్తూ సిద్ధంగా ఉన్నాడు ఆనంద్. గురికి బాతుల గుంపు సరిగ్గా అందిన తక్షణం కాల్చేద్దామని.

వచ్చేస్తున్నాయి.. దగ్గరగా.. మరింత దగ్గరగా.. ఊపిరి బిగబట్టి తీక్షణంగా గురిచూస్తున్నాడు ఆనంద్. ఇంతలో గుంపులో రెండు మూడు బాతులు మెడలు ప్రక్కకు త్రిప్పుతూ కార్ కార్ మని సన్నగా అరిచాయి.

''మేరీ, నువ్వు కూర్చుండిపో. కదలకుండా కూర్చో. నీ ఎర్రకోటు వాటికి అనుమానం కలిగిస్తు న్నట్టుంది. గుంపు మళ్ళీ పోగలదు''.

కోటు విప్పి బైటకు కనపడకుండా దాచుకొంటూ తుపాకీని పక్కకు పెట్టి కదలకుండా కూర్చుంది మేరీ.

రివ్వున బాతుల మంద వచ్చేసింది, సరిగ్గా అనుకున్న గురికి. జోడుగుళ్ళ తుపాకీ ''ఢాం, ఢాం'' అని పేలింది.

డబ్ డబ్ మని కొన్ని బాతులు పడిపోయాయి. నాలుగైదు దెబ్బలు తిని టప టపమని రెక్కలు కొట్టుకుంటూ ఎగరబోయి పడ్తూ లేస్తూ నీటి మీద చట పట కొట్టుకుంటున్నాయి. మిగతా గుంపు కార్ కార్ కార్ మని అరుచుకుంటూ చెల్లాచెదురుగా పారిపోతున్నాయి. ఈలోగా మెరుపులా మరో రెండు తూటాలు బిగించి ఢన్ ఢన్ మనిపించాడు. మరో మూడు నాలుగు రాలిపోయాయి. పిట్టల అరుపులు, దెబ్బలు తిన్న పిట్టలు కీచుగోల; తుపాకీ పొగతో నిండిపోయిందా ప్రాంతమంతా.

గట్టిగా ఊపిరి పీల్చుకొని తుపాకీ దించి విజయగర్వంతో చూశాడు మేరీ వైపు ఆనంద్‌బాబు.

పట్టరాని ఆనందంతో మేరీ ''గుడ్‌షాట్ ఆనంద్, బాగా కొట్టావ్!'' అంటూ పడిపోయిన పిట్టల్ని పొగకి చేతులు అడ్డం పెట్టుకుంటూ, ''ఒకటి, రెండు.. మూడు'' అని మొత్తం పదకొండు

పిట్టల్ని లెక్క పెట్టింది. దెబ్బలు తిని కొట్టుకుంటున్నవి మరో ఐదు.

మేరీ పడవ నడుపుతుంటే, ఆనంద్ పడిపోయిన పిట్టల్ని ఒక్కొక్కటినీ అందుకొని పడవలో పడేశాడు. దెబ్బలుతిన్న పిట్టలు అందకుండా అటూ ఇటూ పారిపోతుంటే ''పట్టుకో, అటు, అఁహాఁ, ఇక్కడ! అరెరే; పారిపోతోంది!'' అంటూ ఒకళ్ళ మీద ఒకళ్ళు పడిపోతూ నానా ఇదై పోతూ మొత్తం మీద అన్నింటినీ ఏరి రెక్కలు కట్టి పడేశారు. ఇంకా పడవలో గింజుకుంటూ గిల గిల లాడుతున్న పిట్టల మీదకి కుక్కపిల్ల భౌ భౌ మని అరుచుకుంటూ వాటి మీద పడి పళ్ళతో పట్టి విదిలించి పారేస్తుంటే దాన్ని అతి కష్టం మీద పట్టుకొంటూ మందలిస్తోంది మేరీ.

ఉండుండి ఆవతలి భాగంలో నుంచి తుపాకులు ధన్ ధన్ మంటున్నాయి. తుపాకులు పేలినపుడల్లా పిట్టల అరుపులలో నిండిపోతోంది పులి చెరువు.

తిరిగి తూటాలు నింపుకొని ఇంకా మీదికి బయలుదేరారు. పడవ నడుపుకొంటూ 22 తుపాకీ ధ్వనులకు పిట్టలు బాగా అదిరిపోయాయి. పారిపోయాయేమో ఎక్కడా కనిపించడం లేదు. అక్క డక్కడ ఒకటి రెండు తెల్ల కొంగలు, నీటికాకులు ; మాత్రం ఉన్నాయి. మేరీ బైనాక్యులర్స్ తీసి చెరువంతా కలయచూసింది. ఎక్కడైనా పిట్టలు కనిపిస్తాయేమోనని.

దూరంగా స్నయిపులు ( ఉల్లంకిలు) మంద ఎగురుతూ ఇటు వస్తుండడం కనిపించింది.

''ఆనంద్! స్నయిపులు వస్తున్నాయి, సిద్ధంగా ఉండు.''

''మేరీ, మనం పడవ మీద ఉంటే లాభం లేదు. చాలా షైబర్డ్స్. ఆనవాలు పట్టి తుర్‌మని పారిపోతాయి. నువ్వు పడవ తీసుకొని ఒడ్డుకుపోయి ఆ చెట్టు కింద కూర్చో. నేను దిగవెళ్ళి ఎక్కడయినా దాగొని కొడ్తాను'' అని అలానే దిగిపోయాడు నీట్లోకి. పులి చెరువు లోతు తక్కువ. ఎక్కడో మధ్యన తప్పించి చాతీ దాటదు నీరు. నాచు బురద మాత్రం నిండుగా వుంటుంది. మోకాలు దాకా బురదలో దిగిపోయాక నాచును తోసుకుంటూ తుపాకీని చంకన పెట్టుకొని వంగుతూ పది గజాల దూరంలో వున్న జమ్ముగడ్డి పొదలో నక్కి ఇంకా తల ఎక్కడైనా బైటికి కనిపించి పోతుం దేమోనని; ఇంత నాచు తీసి తలమీద పెట్టుకొని స్నయిపులు రాకకోసం వెయ్యి కళ్ళతో గడ్డి సందుల్లోంచి చూస్తున్నాడు.

ఒడ్డున చెట్టుకింద కూర్చున్న మేరీ నాచు నెత్తిమీద పెట్టుకొని గడ్డిలో దూరి కూర్చున్న ఆనంద బాబు వాలకాన్నీ, అతన్నీ చూస్తూ ఉండుండి నవ్వుకుంటోంది. ఆకాశం మీద మబ్బులు కూడుతున్నాయి.

అలా సుమారు పది నిమిషాలు కూర్చున్నాడు ఆనంద్ బాబు నిరీక్షిస్తూ. ఎలా అయితే నేం స్నయిపు లు కనుచూపు మేరలో కనిపించాయి. ఆనందం పట్ట శక్యంకాకుండా వుంది ఆనంద్ బాబుకి.

స్నయిపులు ఎగరడం ఒకేస్థాయిలో వుండదు. ఇట్నుంచి అటు , అట్నుంచి ఇటు; మీదికీ, కిందికీ ఇష్టం వచ్చినవైపు చక్ చక్ చక్ మని మెరుపు వేగంతో ఎగుర్తుంటాయి. వాటిని కాల్చడానికి ప్రత్యేక నైపుణ్యం కావాలి.

అదృష్టవశాత్తూ స్నయిపుల గుంపు ఎగుర్తూ ఆనంద్ బాబు వైపు సూటిగా రివ్వున బాణంలా వచ్చేస్తున్నాయి. అలా పది గజాల దూరం దాకా రానిచ్చాడు. గుంపు మధ్యగా గురిచూసి ట్రిగ్గర్

నొక్కబోయాడు. అంతే! ఆ క్షణంలోనే హఠాత్తుగా అంత గుంపున్నూ ఆ వేగంతోనే రయ్ మని వెనక్కి తిరిగి అట్నుంచి ఇటు ఇట్నుంచటు గజిబిజిగా ఎగిరిపోతూ కాల్చడానికి వీలుకాకుండా పారిపోయాయి.

''డామిట్, మంచి చాన్స్ మిస్ అయిపోయింది!'' అని విసుక్కుంటూ లేచి నాచు తీసిపారేసి తల బరబర బక్కురుక్కొంటూ, తుపాకీ భుజాన్నేసుకొని ఉస్సురుమంటూ బురదలో కూరుకుపోతున్న కాళ్ళని ఈడ్చుకొంటూ బయలుదేరాడు.

''స్నయిపు షూటింగంటే తమాషా అనుకున్నావేమిటి? అయిందా దొరగారి పని? మా డాడీ అయుంటేనా, పువ్వుల్లాగా రాల్చేసుండేవాడు!'' అంటూ ఆనంద్ బాబును డౌన్ చేయడం మొదలెట్టింది మేరీ.

''ఛా, మాంచి ఛాన్సు పోయింది మేరీ.. అయినా అవి నిన్ను చూసే పారిపోయాయి. ఒడ్డున చెట్టుకింద దాగొని కూర్చోమంటే ఫోజులు కొట్టుకుంటూ స్పష్టంగా బయటకు కనిపించి పోతుంటే పారిపోవూ?''

''బాగుందీ వరస. మధ్య నామీద తోసేస్తావేం. మరీ అంత దగ్గరగా రానిచ్చావెందుకు? పిట్టల గుంపు కాస్త దూరంగా వుండగానే కొట్టేలేకపోయావ్?''

''ఫ్లయిట్ చాలా ఇరెగ్యులర్‌గా వుంది. వీలులేక పోయింది. ఏం జేస్తాం, పోనీ!'' అని చిన్న చినుకు లు పడుతుంటే తలెత్తి చూశాడు. రెండు గూడ బాతులు బార్ బార్ మంటూ ఎక్కడ నుంచి వచ్చాయో గుడ్డివేగంతో అప్పుడే ఆనంద్ బాబు తలమీది నుండి దాటేస్తున్నాయి. కనురెప్పపాటులో తుపాకీ ఇంకా భుజానికి ఆనించకుండానే ఢాం మనిపించాడు. ఒకటి చక్రంలా గిరగిర తిరుగుతూ దబ్బున నీటిలో పడిపోయింది. రెండోది బార్ బార్ మని అరుచుకుంటూ పారిపోతుంటే దాన్ని కూడా కాల్చేద్దామని తుపాకీని తిప్పాడు; కానీ వీలులేకపోయింది.

టప టప మని చినుకులు పడటం ప్రారంభించాయి.

''వెరీ ఫైన్ షాట్ ఆనంద్.. చినుకులు పడ్తున్నాయి; త్వరగా వచ్చేసేయ్!''

పడిన బాతును చేత పుచ్చుకొని నెత్తిమీద చినుకులకు చెయ్యి అడ్డుపెట్టుకుంటూ గబగబా ఒడ్డుకు వచ్చేస్తున్నాడు.

''క్విక్, క్విక్; ఊఁ, త్వరగా వచ్చేసేయ్ ; తడిసిపోతున్నావ్. ఆ పిట్టనిలా పారేయ్!''

''బురదలో కాలు అంటుకుంది. కాస్త చెయ్యియ్యి!'' అన్నాడు పిట్టని గట్టుమీదికి విసిరేస్తూ. మేరీ చెయ్యి అందించింది. ఊత పట్టుకొని లేస్తూ చటాలున తనమీదికి లాక్కున్నాడు. బేలెన్స్ తప్పి ఇద్దరూనీట్లో దభాలున పడ్డారు. ఇద్దరి బట్టలూ బురదతోనూ, నీటితోనూ మునిగిపోయాయి.

''అయామ్ సారీ'' అంటూ మేరీని లేవదీశాడు.

''పో, ఆనంద్'' అంటూ కొంటెగా ప్రక్కకు తోసేసింది. చేతుల గాజులు గల్లుమంటుంటే.

''ఉహూఁ''.. అలానే చెయ్యి పట్టుకొని.

''శ్ ! అదిగో మా డాడీ వస్తున్నాడు!''

''మీడాడీ అవతల, మనం ఇవతల!''

సిగ్గు తెరలు కమ్మేస్తున్నాయి మేరీకి. మేరీ నడుం మీద ఆనంద్ చెయ్యి. ఇద్దరూ చెట్టు కిందకు

పరుగెత్తి చెట్టు మొదట్లో కూర్చున్నారు.

వర్షం జోరుగా కురుస్తోంది. చిన్న చిన్న ఉరుములు ఉరుముతున్నాయి. చలిగాలి వీస్తోంది.

''మా నాన్నంటే నీకంత హడలెందుకు?''

''మీ డాడీ మీసాలు చూస్తుంటే తంతాడేమోనని భయం!''

''ఓయబ్బో ఊఁ మానాన్న ఏ సంగతైనా అడిగాడా?'' తలదించుకొంటూ.

''ఏ సంగతి?'' అర్థంకాక.

''మొన్న నన్ను మా నాన్నడిగాడు...''

''ఏమిటి?''

''చెప్పను, పో!''

''చెప్పుదూ, మరిన్నూ!''

''సిగ్గేస్తుందమ్మా.. ఊహుఁ''

''ఓయమ్మో, పోనీ; అటు ముఖం తిప్పి చెప్పు!''

''ఆనంద్‌ని పెళ్ళాడతావా? – అని!''

''అహ్హ, కొంపతీసి పెళ్ళాడతనన్నావేమిటి?''

''పెళ్ళాడను,పొమ్మన్నాను....''

''థాంక్యూ, థాంక్యూ!''

కిసుక్కున నవ్వి ముఖం పక్కకు తిప్పింది.

''ఆ నవ్వు నన్ను చూడనీ,'' అని జడపట్టుకులాగాడు.

''ఛీ, పో!'' అంటూ ఆనంద్ ఒళ్ళో వాలిపోయింది ముఖం దాచుకొంటూ.

''మరి నువ్వో?''

''నిన్ను చూసి రమ్మనేగా, అమ్మ పంపింది! ఇదిగో మేరీ, నువ్వొద్దన్నా నిన్ను పెళ్ళాడేస్తాను; అంతే. లేదా, అమాంతంగా ఎత్తుకుపోతాను!'' అంటూ ఎత్తబోయాడు.

''ఎక్కడికి? అమెరికాకా?'' అంది ఆనంద్ బాబు బూటుని వేలుతో రాస్తూ.

''డిస్నీ లాండ్‌లో దేవకన్యలా తిప్పుతాను.''

''నేను దేవకన్యలా వున్నానా? ఉహూఁ!'' అని ఆశ్చర్యంగా బుంగమూతేసుకుని కళ్ళు తిప్పుతూ ఫక్కున నవ్వింది. మబ్బులు నిండిన ఆకాశంలో విద్యుల్లత చరాలున మెరిసింది.

కుక్కపిల్ల ఆకుల మధ్య దూరి నిద్రపోతోంది. మహా అలిసిపోయినట్లు.

ప్రక్కనే ఉన్న ఎర్రగన్నేరు పువ్వు తుంచి మేరీ తల్లో తురిమాడు ముచ్చటగా.

క్షణం సేపు ఎవ్వరూ మాట్లాడలేకపోయారు ఆనందపారవశ్యంలో.

## 8

అప్పటికి వర్షం తగ్గుముఖం పట్టింది. చినుకులు సన్నగా పడుతున్నాయి. చెట్ల ఆకుల మీద నుంచి నీటిబొట్లు మేరీ ఆనందబాబుల మీద ఉండుండి టపటపమని రాల్తున్నాయి. వింతల్లో కాల్లో విహరిస్తున్న వాళ్ళకు మల్లెలు రాల్తున్నట్టుంది.

''బార్ బార్ బార్'' మనే విషాద ధ్వనితో వాళ్ళు తుళ్ళిపడి లేచారు. జంటని పోగొట్టుకున్న

ఒంటి బాతు ''బార్ బార్'' మంటూ అరుచుకుంటూ తన చెలి పడిపోయిన స్థలం మీద తిరుగుతోంది. చెవులు గింగురుమనే ఆ అరుపులు హృదయ విదారంగా ఉన్నాయి.

''చ్చ; పాపం. ఇందాకటి గూడబాతుల జంటలో ఒకటి. చచ్చిపోయిన దాన్ని గురించి విలపిస్తూ పిలుస్తోంది. ఆ మూగజీవి ఆర్తనాదం ఎవరు వింటారు? ఇంకా వస్తుందేమోననే ఆశతో అంతా కలయజూస్తూ పిలుస్తోంది!'' అంది మేరీ విచారంగా.

''అవును మేరీ, నాకూ ఆ అరుపులు వింటూంటే బాధగా ఉంది. దీన్ని కూడా కాల్చేస్తాను. ఏ గొడవా ఉండదు! అంటూ పక్కనున్న తుపాకీ తీసి గురిచూసి ట్రిగ్గర్ నొక్కాడు కూల్చెయ్యడానికి, ''క్లిక్'' మంది పేలకుండా. విధి అనుకూలంగా లేదు.

తూటా పేల్లేదు. అది ఇంకా ఎడబాటుతో కృశించి నశించి పోవాలనిగాబోలు, దైవసంకల్పం. అలానే అరుచుకుంటూ పారిపోయింది. గుండెలు తరుక్కుపోయే ఆ అరుపు దూరమయ్యేదాకా నిశ్శబ్దంగా జాలిగా విన్నారు.

''పూర్ క్రీచర్, చచ్చినా బాగుండిపోను!'' అంది మేరీ సహజ ధోరణిలో స్త్రీత్వంతో.

ఒకవైపు వాన వెలుస్తూ వెలుస్తూంటే మరో వైపు నుంచి ఎండ వస్తోంది. ఆ ఎండవానల కలయికలో అవిర్భవించిన హరివిల్లు సప్తవర్ణాలతో ఆకాశం మీద ఉదయించింది. అంతవరకు ఒంటరి బాతు అరుపు వల్ల చెదిరిపోయిన మనస్సుకి ఈ హరివిల్లు ఆనందాన్నిచ్చి కుదుటబెట్టింది.

వాన వెలిసింది. పిట్టలు తిరిగి నీటిమీద మందలుగా కూడుతున్నాయి. దాసరి కోడి పిల్లలతో గడ్డిలోంచి బయటకు వచ్చి తిరుగుతోంది. రెయ్యి కాళ్ళ పిట్టలు చీపురుపుడకల్లాంటి కాళ్ళేసుకొని తామరాకుల మీద పరుగెడుతున్నాయి. సూర్యరశ్మి నీళ్ళ మీద రంగు నీడల్ని ప్రతిఫలిస్తోంది.

మళ్ళీ ఆవలి భాగంలో తుపాకులు పేలాయి. ''ధూం! ధూం''మని కొండల్లో ప్రతిధ్వనించాయి. తిరిగి పిట్టల గోల యధా ప్రకారంగా మొదలైంది.

కుక్క పిల్ల నిద్రలేచి ''కుంయ్ , కుంయ్'' మని గోలచేస్తోంది.

మేరీ ఆనంద్‌బాబులు కొత్త శక్తిని పుంజుకొంటూ తిరిగి వేటకి బయలుదేరారు. ''ఈసారి ఛాన్సు నీదే మేరీ. నీ 22 రైఫిలు తీసుకో''.

పడవలో కూర్చున్నారు. కుక్క పిల్ల కూడా పడవ ఎక్కింది. అక్కడక్కడ పిట్టల్ని ఒక్కొక్కటిగా 22 బోరు రైఫిలుతో మేరీ పేల్చుతోంది. లెక్కపెట్టి కొట్టినట్టు ఒక్కొక్క దెబ్బకి ఒక్కొక్కటి చొప్పున రాలిపోతున్నాయి. ఈ చిన్న సైజు రైఫిలు శబ్దం అతి స్వల్పంగా ఉంటుంది. పక్కనున్న పిట్ట పడిపోయినా రెండవ దానికి ఆదెందుకు పడిపోయిందో తెలీదు. ఆలోచించుకునే లోగా అదికూడా ఠాప్‌మని పోతుంది. మేరీ రైఫిలు షూటింగు అతి ప్రతిభావంతగా ప్రదర్శిస్తుంటే ఆనంద్‌బాబు నిజంగా నిశ్చేష్టుడై పోయాడు. కొట్టిన పిట్టల్ని దేవుకుంటూ మధ్య మధ్య కుక్క పిల్లని మందలిస్తూ ఫ్లాస్కులో కాఫీలు తాగుతూ కేరింతలు కొట్టుకొంటూ, నవ్వుకుంటూ, విరగబడుతూ అలా చెరువు ఈవలి భాగం అంతా మూడు నాలుగుసార్లు తిరిగారు. పిట్టల్ని వెతుకుతూ, వెంటాడుతూ, వేటాడుతూ మధ్య మధ్య ఈదే చేపల్ని చేత్తో పట్టుకోబోతూ, మధ్యాహ్నం మూడు గంటల దాకా వినోద యాత్ర సాగించారు. ఇంకా అలానే కొన్ని సంవత్సరాలు తిరిగేవారేమో ఆ కులుకుతో, ఆ ఆనందంతో! కాని తిరిగిన చోటనే పదే పదే తిరగటం వల్ల బోరెత్తి

విసుగెత్తిపోయారు. దాంతో సాయంకాలం కూడా అవుతోంది. ఇహ వెళ్ళిపోవాలని ముసలాళ్ళు కూడా ఈపాటికి వచ్చేసి కాచుకొనుంటారు అని తిరుగు ప్రయాణం కట్టారు గుట్టలుగా పడవలో నిండిన పిట్టలతో.

పోతూపోతూ ''గుడ్‌బై టు పులి చెరువు!'' అంటూ గాలిలో సెల్యూట్ చేసి ఆఖరిసారిగా బైనాక్యులర్స్‌లో చెరువంతా కలయ జూసాడు, చివరి ఛాన్సు ఏదైనా తగులుతుందేమోనని. చెరువు కొసన కొన్ని గజాల దూరంగా నత్తగొట్లు మేసుకుంటున్నాయి నత్తల్ని.

''మేరీ, నత్తగొట్లు గుంపుంది; అదిగో! పెద్ద మందేగాని అక్కడక్కడ విడిపోయున్నాయి. నీ టూ టూ బోర్‌తో ఒక్కటొక్కటిగా అరడజను ఏరైయ్యొచ్చు. లాస్ట్ ఛాన్స్. పద''.

''వద్దుబాబూ! అందులో చెరువులోనూ లేవు. దూరంగా ఎక్కడో వున్నాయి. అంతా బురద ఎవరెల్తారు!''

''ప్లీజ్, నీ కోసం కాదు; నా కోసం! నువ్వు ఒడ్డున నిలబడి ఒక్కొక్కటిని కొట్టెయ్యి. నేను వెళ్ళి ఏరి తీసుకొస్తానుగా! నేలమీద పిట్టల్ని నువ్వు కొడ్తుంటే ఎలాగకొడ్తావో చూడాలని వుంది. ప్లీజ్ !'' అన్నాడు గెడ్డం పట్టుకొని బ్రతిమలాడుతూ.

''నేను రాను .''అంటూ మూతి తిప్పుకుంది; ఇంకా బ్రతిమిలాడించుకోవాలని. అలా పదిసార్లు బ్రతిమిలాడించుకుని బయలుదేరింది.

పులి చెరువును ఆనుకొని సుమారు మూడెకరాల బురద నేలుంది. వర్షాకాలం ఈ నేల మొత్తం అంతా నీటితో నిండి చెరువుతో కలిసిపోయి సరిసమానంగా ఉంటుంది. మిగతా కాలాల్లో ఈ నేల కాస్త మెరక అవటం వల్ల అక్కడ నీరెండిపోతుంది. కాని చెరువుకి ఆనుకొనే ఉండడం వల్ల నీరూరుతూ చెమ్మగా బురదగా ఉంటుంది. అక్కడక్కడ రెల్లు పొదలు గుబురుగా పెరిగున్నాయి. బురదలో నత్తగుల్లల్ని ముక్కుతో తవ్వుకుంటూ నత్తగొట్లు తింటున్నాయి.

ఒడ్డున పడవను ఆపి, మేరీ ఆనంద్ బాబులు కొంతదూరం నడిచి, పక్కనే వున్న నల్లరాయి మాటుగా నక్కి కూర్చున్నారు. రాయిమీద తుపాకీని రెస్టు చేసి టెలిస్కోపిక్‌సైట్ లో నుంచి నత్తగొట్లను గురిచూస్తోంది మేరీ. సుమారు ముప్ఫయి గజాల దూరంలో చెదురు మదురుగా నత్తగొట్లు మేసుకుంటున్నాయి. సాయంకాలమవుతోంది. నల్లటి బురద నేల మీద నత్తగొట్లు తెల్లగా సుస్పష్టంగా రైఫిలుకు అమర్చిన దూరదర్శినిలో కనిపిస్తున్నాయి.

''బీ క్విక్ మేరీ! ఫైర్!'' అన్నాడు ఆనంద్

''ఠప్.... ఠప్.....ఠప్... ఠాప్.... ఠాప్....'' మని ఐదుసార్లు తుపాకీ పేలింది. ఐదు పిట్టలు అక్కడి కక్కడే పడిపోయాయి. మిగతావి పసిగట్టి ఫర ఫర మని రెక్కలు కొట్టుకొంటూ ఎగిరి పోయాయి.

''నువ్విక్కడే వుండు, నేను తెస్తాను!'' అంటూ పరుగెత్తుకుంటూ పోయి ముందుగా దగ్గరలో పడివున్న రెండిటిని పట్టుకొచ్చి గట్టుమీద విసిరేశాడు. కాస్త దూరంలో ఒకటి, ఆ పక్కనే మరొకటి, ఇంకా కొంచెం దూరంలో మరొకటి పడున్నాయి. బూటు కాళ్ళు బురదలో కూరుకుపోతున్నా లెక్క చేయకుండా అతి కష్టం మీద కాళ్ళు పైకి లాక్కుంటూ మొత్తంమీద మూడింటినీ పట్టుకొని ''అన్నీ దొరికిపోయాయి మేరీ!'' అంటూ మూడు పిట్టల్ని మోసుకొంటు వస్తున్నాడు.

''ఆనంద్, ఇలా రాకు! బురదలో కాళ్ళు కూరుకుపోతున్నాయి. అలా ఆ పక్క నంచి తిరిగిరా. అక్కడ నేల కాస్త ఎండుగా ఉన్నట్టుంది. ఆ గట్టు దగ్గరకు వచ్చేసేయ్. నేనూ అక్కడికే వస్తున్నా.'' అంటూ చిన్న పరుగు తీస్తూ ఆ గట్టు దగ్గరికి వెళ్ళింది. ఆనంద్ చుట్టూ తిరిగి వస్తున్నాడు. నేలకాస్త గట్టిగానే ఉంది రాను రాను మరింత గట్టి నేల తగిలింది.

''హమ్మయ్య. ఇటు బురద లేదు. నేల గట్టిగా వుంది!'' అంటూ మూడు పిట్టల్ని భుజాన్ని వేసుకుని, గట్టునున్న మేరీ ''కమాన్ కమాన్'' అని చేతులు చాచి కవ్విస్తూ పిలుస్తుంటే ''ఎస్, ఎస్! కమింగ్ డియర్!'' అంటూ నవ్వుతూ ఒగర్చుకుంటూ పరుగెత్తుకొస్తున్నాడు. మేరీ దగ్గరకు. పరు గెత్తుతూ పరుగెత్తుతూ ఒక దగ్గర బుసుక్కున బురదలో దిగబడిపోయాడు మోకాలు దాకా. చేతిలో పిట్టలు తుళ్ళిపోయాయి.

''ఫరవాలేదులే, ముందే బట్టలు బురదయి పోయాయిగా, మెల్లిగా వచ్చేసేయ్!'' అంటూ ఉండ బట్టలేక కిలకిల నవ్వటం మొదలెట్టింది మేరీ. తన అవస్థ చూసి తనకే నవ్వొచ్చి తనుకూడా నవ్వడం ఆరంభించాడు ఆనంద్ బాబు. ఇద్దరూ విరగబడి నవ్వుతున్నారు. ఇద్దరి నవ్వులు ఏకమై పోయాయి.

నవ్వుతూ నవ్వుతూన్న ఆనంద్ హఠాత్తుగా ఆగిపోయాడు. ఇంకా మేరీ నవ్వుతూనే ఉంది. ఆనంద్ నవ్వడేమా అని చూస్తోంది. కాని ఆనంద్ నవ్వటం లేదు! నవ్వించాలని ఇంకా గట్టిగా నవ్వడం మొదలెట్టింది. వెక్కిరించింది. ఆనంద్ నవ్వటం లేదు. సడన్ బ్రేక్ వేసినట్లు ఆనంద్ నవ్వు ఆగిపోవటానికి కారణం అర్థం కాక సూటిగా ఆనంద్ ముఖంలోకి చూసింది. ఆనంద్ ముఖం వివర్ణమై పోతోంది.

.....

''ఆనంద్!''

''....''

''అలా అయిపోతున్నావేం, ఆనంద్?'' అతని ముఖంలో కవళికలు అర్థం కాక

''మే.. మేరీ!'' అని గావుకేక పెట్టాడు ఆనంద్. ఆ అరుపులో నరకయాతన స్పష్టమౌతోంది.

''ఆనంద్, ఏమిటది?'' అంది కంగారుగా.

''ఊబిలో దిగబడిపోయాను. నేను కూరుకుపోతున్నాను మేరీ.'' అప్పటికప్పుడే మొలదాకా కూరుకుపోయాడు. అటు సూర్యుడు అస్తమిస్తున్నాడు.

''ఆనంద్, వచ్చేసెయ్ ఆనంద్! వచ్చేసెయ్ ; ఇదిగో, వస్తున్నా; నా చెయ్యి పట్టుకో!'' అని పరుగెత్తబోయింది.

''మేరీ, దగ్గరగా రాకు. నా మీద ఒట్టు. దగ్గరగా వచ్చావంటే నువ్వూ కూరుకుపోతావ్.'' ఒకొక్క అంగుళం నెమ్మదిగా దిగిపోతున్నాడు. ఆశగా చేతుల్ని ఇటు అటు కొట్టుకుంటున్నాడు. ఆఖరిక్షణంలో దేన్నయినా పట్టుకుందామని.

''ఆనంద్!.. ఆఁ? అలా దిగిపోతున్నావేం? భయపడకు. ధైర్యంగా వుండు. నాన్నని పిలుస్తా నుండు. డాడీ!.. డాడీ!''.. ఆ అరుపులు కొండల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. ఆనంద్ బురదలో బుస బుసమని దిగిపోవడం స్పష్టంగా వినిపిస్తోంది. కళ్ళల్లో నుంచి నీళ్ళు కారుతున్నాయి. అది చూసి

మేరీ తట్టుకోలేక భోరున ఏడ్చింది. పిచ్చిదానిలా జుత్తు పీక్కుంది. అటూ ఇటూ పరుగెత్తుతూ ''డాడీ! డాడీ!'' అని కేకలేస్తూ తండ్రిని పిలుస్తోంది. కాని అది అరణ్య రోదన. ఎవరు ఆలకిస్తారు?

''ఫరవా లేదు. నువ్వు చచ్చిపోవు. నువ్వు చచ్చిపోవు, ఆనంద్!'' అంది జాలిగా, ఆనంద్ ముఖం లోకి చూస్తూ.

గుండెల దాకా కూరుకుపోయాడు.

''మేరీ, ఆఖరి కోరిక. తీరుస్తావా?..ఒక్కటే...'' ప్రాధేయపూర్వకంగా కోరాడు.

''చెప్పు ఆనంద్; నువ్వేం చెయ్యమన్నా చేస్తాను... చెప్పు!''

''ప్రామిస్?''

''ప్రామిస్!''

''నీ తుపాకీతో నన్ను షూట్ చేసెయ్: ప్లీజ్: నేను నరక యాతన అనుభవిస్తూ ఊబిలో విలవిలా తన్నుకుంటూ చావలేను: నన్ను కాల్చేయ్: సరిగ్గా నుదుటికి గురిపెట్టి పేల్చేయ్: హాయిగా ప్రాణం పోతుంది: మేరీ:... ప్లీజ్! నీకు దణ్ణం పెడతాను:''

''ఏమిటానంద్, ఇది? నీకు మతిగాని పోయిందా?''... నేను నిన్ను కాల్చాలా? ఏమిటా కోరిక..?'' నో..నో... నేను నిన్ను చంపాలా? నన్ను చిత్ర వధ చెయ్యకు....''

''మేరీ-ప్లీజ్-షూట్‌మీ-నన్ను చంపేయ్-కిల్‌మీ-ప్లీజ్, ప్లీజ్!'' అంటూ హిస్టీరిక్‌గా గావుకేకలు పెడుతూ బురదని పిడికిలి బిగించి దబ దబ బాదుతున్నాడు. ఈ కదలిక వల్ల మరింత వేగంగా బురదలో కూరుకుపోతున్నాడు. భుజాల్ని ముంచేసింది బురద...

.........

''నన్ను షూట్ చెయ్యవు కదూ. పోనీలే మేరీ.. నేనిలానే చస్తాను!''

పీక వరకు కూరుకుపోయాడు...

''వస్తాను మేరీ.. మరి వస్తానూ!?.. బై, బై!'' అంటూ సన్నగా నవ్వబోయాడు. చటుక్కున నోరు ముక్కు బురదలో దిగిపోయాయి. ఆఖరిసారిగా కళ్ళు ఆశగా మేరీనిచూస్తూ మునిగిపోయాయి. ఆనంద్ బాబు అయిపోయాడు. ఆ చోట బురదలో నుంచి ఉండుండి బుడగలు వస్తున్నాయి.

మేరీ అలా చూస్తూ శిలా ప్రతిమలా ఉండిపోయింది. తన ఎదుట, తనతో, తన మనస్సుతో, అంతవరకూ ఆడుకున్న ఆనంద్ మాయమైపోయాడు. తలలోని ఎర్రగన్నేరు వాడిపోయి రాలిపోతోంది.

ఎప్పుడొచ్చిందో అక్కడికి, జంటపోయిన ఒంటి బాతు కేర్ కేర్ మని అరుచుకుంటూ చెలిని పిలుస్తూ విలపిస్తూ ఆకాశం మీద తిరుగుతోంది.

పడవలోని కుక్కపిల్ల ఆనంద్ బాబు ఎక్కడికి వెళ్ళాడా అని వాసన చూస్తోంది.

.......

సూర్యుడు అస్తమించాడు.

పిట్టలు గూటికి చేరుకున్నాయి.

★

( ఆంధ్రజ్యోతి, వీక్లీ: 24.11.67, 1.12.67.)